

ఫ్లైఓవర్ పనులతో భెల్‌చౌరస్తాలో రోడ్డు దుస్థితి

అధ్వానంగా రోడ్లు

- అభివృద్ధి పనుల పేరుతో ఎడాపెడా తవ్వకాలు
- వర్షాలకు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం

మియాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ కొట్టుకుపోయి అధ్వానంగా మారాయి. వివిధ ప్రాంతాల్లో మంజీర డ్రైనేజీ పైపులైన్లు కోసం రోడ్లను ఎడాపెడా తవ్వేశారు. దీంతో ఒకపక్క వరదనీరు మరోపక్క గుంతలమయంగా మారిన రోడ్ల కారణంగా రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా చందానగర్ హుడాకాలనీ నుంచి హఫీజ్‌పేట వరకు మంజీర పైపులైన్ కోసం రోడ్డు తవ్వి ఎక్కడిక్కడ మట్టికుప్పలు వేసి రోడ్లను అలాగే వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి బురదమయంగా మారడంతో పాటు రోడ్డు గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఎంఏనగర్ నుంచి ప్రశాంత్‌నగర్, ప్రశాంత్‌నగర్ నుంచి కృషినగర్, దీప్తిశ్రీనగర్ నుంచి ధర్మపురి క్షేత్రానికి వెళ్లే రహదారి, పాపిరెడ్డికాలనీ, హుడాకాలనీ, మరోపక్క ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్న బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలోని నాలుగు రోడ్లు గుంతలమయంగా మారాయి. రోడ్లు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్లపై ఉన్న గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



మియాపూర్‌లో వర్షాలకు కొట్టుకుపోయి గుంతలమయంగా మారిన రోడ్డు

జేఎన్‌టీయూ కాలేజీలకు ప్రిన్సిపాళ్ల నియామకం

హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న రెండు ఇంజనీరింగ్ కాలేజీలకు కొత్త ప్రిన్సిపాల్స్‌ను నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ జగిత్యాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను సిరిసిల్లా జేఎన్‌టీయూ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా నియమించారు. అక్కడ డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌ను హైదరాబాద్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి తీసుకొచ్చారు. జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈసీఈ ప్రొఫెసర్ ప్రభాకర్‌ను అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. తాజా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

జంట సర్కిళ్లలో 14 శిథిల ఇళ్ల గుర్తింపు

కుత్బుల్లాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు డివిజన్లలో శిథిలావస్థకు చేరిన పాత భవనాలుపై అధికారులు దృష్టి సారించారు. శిథిల భవనాల కారణంగా ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా పట్టణ ప్రణాళికా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రతీ డివిజన్‌లో సిబ్బంది తిరుగుతూ సర్వే చేపట్టి శిథిల భవనాలు గుర్తించి అవకాశమున్న వాటికి మరమ్మతులు చేసుకోవాలని, పూర్తి దెబ్బతిన్న వాటిని కూల్చివేయాలని నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు జీడిమెట్ల డివిజన్‌లోని కుత్బుల్లాపూర్ గ్రామంలో 8, రంగారెడ్డినగర్ డివిజన్‌లో 2 ఇళ్లను గుర్తించారు. అలాగే గాజులరామారం సర్కిల్ పరిధిలో 4 ఇళ్ల గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉంటున్న వారు ఖాళీ చేయాలని అధికారులు కోరారు.



శిథిలావస్థకు చేరిన ఇల్లు

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

పేట్‌బషీరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లపై నిర్వహిస్తున్న దుకాణాలు, బోర్డులను జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సోమవారం తొలగించారు. సుచిత్రా చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే నాళా వరకు ఉన్న ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ ఏసీపీ సాయి బాబు ఆధ్వర్యంలో సిబ్బంది, పోలీసులు తొలగించారు. రహదారి ప్రక్కన ఉన్న తోపుడుబండ్లను జీహెచ్ఎంసీ కార్యాలయానికి తరలించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేయడం వల్ల రోడ్లపైనే వాహనాలను నిలిపి వాహనదారులు కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో రద్దీగా ఉండే రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ విషయం అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను తొలగిస్తున్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు



కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, నాయకులతో జగదీశ్వర్‌గౌడ్

జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

హైదర్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, నాగేష్‌గౌడ్, షౌకత్‌అలీమున్నా, గోపాల్, లింగరావు, భీమ్‌రావు, శ్రీనివాస్, సుధాకర్, ప్రభాకర్, రాజ్యలక్ష్మి, అరుణ, సౌందర్య, స్వరూప, కృష్ణవేణి, అనురాధ, నిర్మలమ్మ, శ్యామల తదితరులు ఉన్నారు.



బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కార్పొరేటర్ శేషగిరి

బీజేపీ నాయకులతో కార్పొరేటర్ సమావేశం

గాజులరామారం , మే 20(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో గాజులరామారం బీజేపీ నాయకులు సైనికుల్లా శ్రమించి ఈటల రాజేందర్ గెలుపు కోసం కృషి చేశారని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ బీజేపీ ముఖ్య నాయకులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఇంతే స్ఫూర్తితో కార్యకర్తలు, నాయకులు పని చేసి బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







నాలాలు వ్యర్థాలు, పూడికతో నిండి. మురుగు ప్రవాహం లేక కంపు కొడుతున్నాయి. మియాపూర్, లింగంపల్లి, దీప్తిశ్రీనగర్ ప్రాంతాల్లో పూడిక తీయకపోవడంతో మట్టి, చెత్తతో నిండిన నాలాలు

పూడికతీత పనులు చేపట్టాలి



సీఐఈలో మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు నీరు

సర్కిల్ ఉపకమిషనర్‌కు వినతి

కుత్బుల్లాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభాన్ని దృష్టిలో పెట్టుకొని తమ కాలనీలోని వరదనీటి కాలువ పూడికతీత పనులను త్వరగా చేపట్టాలని కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుకర్, సభ్యులు సర్కిల్ ఉపకమిషనర్ వి.నర్సింహకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వర్షం వచ్చినప్పుడల్లా తమ కాలనీలోని నాలా పొంగి రోడ్లు, ఇళ్లను మురుగునీరు ముంచెత్తుతుందన్నారు. ఇంద్రసింగ్‌నగర్ హెచ్‌పీగ్యాస్ గోడౌన్ ఎదుట వరదనీటి కాలువ పనులను పూర్తిచేయాలని కోరారు.



డీసీ నర్సింహకు వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్వరనగర్ కాలనీ నాయకులు

ఓపెన్ నాలాతో ఇబ్బందులు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్‌నగర్ ప్రజలు ఓపెన్‌నాలా నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్రఇబ్బందులు పడుతున్నారని కాలనీ మాజీ అధ్యక్షుడు చారి ఆవేదన వ్యక్తం చేశారు. జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని ఈ కాలనీలో దాదాపు ఐదొందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, కాలనీ మధ్యలో ప్రవహిస్తోన్న ఓపెన్ నాలాలో ప్రమాదకరమైన వ్యర్థ రసాయనాలు కలుస్తుండడంతో తీవ్రదుర్వాసన వెదజల్లుతోందన్నారు. దుర్వాసన కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు.

- బాలానగర్‌లో..

బాలానగర్ కో ఆపరేటివ్ ఇండస్ట్రీస్ ఎస్టేట్(సీఐఐ)లో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి మమ అనిపిస్తున్నారు.



జీడిమెట్ల ఎస్ఆర్‌నాయక్‌నగర్ ఓపెన్‌నాలాలో ప్రవహిస్తున్న మురుగునీరు

గోపన్‌పల్లి చెరువులో వ్యర్థాల డంపింగ్

- పట్టించుకోని అధికారులు
- గతంలోను శిఖం స్థలంలో ఇళ్లు నిర్మించి అమ్మకాలు
- అధికారుల అండతోనే కబ్జాలు: స్థానికుల ఆరోపణ

రాయదుర్గం, మే 20 (ఆంధ్రజ్యోతి): భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూములు, చెరువులు, శిఖం, నాలాలను కబ్జాలు చేస్తు యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నారు. అధికారుల అలసత్వంతో కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. తాజాగా గచ్చిబౌలిలోని గోపన్‌పల్లి పెద్దచెరువులో వ్యర్థాలను డంపింగ్ చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు. పెద్దచెరువును కబ్జా చేసేందుకు లారీలు, ట్రాక్టర్లతో వ్యర్థాలను చెరువులో వ్యర్థాలు డంప్ చేస్తున్న విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఈ తరహా కబ్జాలకు తెరలేపారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలోను భూ కబ్జాదారులు చెరువు శిఖం స్థలంలో మట్టినింపి ఇళ్లు నిర్మించి అమ్ముకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినపట్టికీ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎవరూ పట్టించుకోలేదని మళ్లీ తాజాగా వ్యర్థాలు డంప్ చేస్తూ చెరువును కబ్జా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



గోపన్‌పల్లి చెరువులో వ్యర్థాల డంపింగ్ చేస్తూ కబ్జా చేస్తున్న దృశ్యాలు



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

వివేకానందనగర్‌కాలనీ, మే 20 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వీవీనగర్ డివిజన్ పరిధిలోని భాస్కర ప్యాలెస్, వోల్గా ఫ్రైడ్ రెసిడెన్సీ, శ్రీదేవి రెసిడెన్సీ, శ్రీకృష్ణనివాస్ అపార్ట్‌మెంట్ వాసులు సప్తగిరికాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం సోమవారం అందజేశారు. వర్షపునీటి నిల్వ ప్రాంతాలు ఎక్కువగా ఉండడం, డ్రైనేజీ, రోడ్డు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గాంధీ వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలన్నింటిని పరిష్కరించేలా కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సత్యం శ్రీరంగం

6 నుంచి నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు

పంజాగుట్ట, మే 20(ఆంధ్రజ్యోతి): 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీలకు నగరం వేదిక కానుంది. జూన్ 6 నుంచి 8వ తేదీ వరకూ హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో జరిగే ఈ పోటీల్లో 26 రాష్ట్రాల నుంచి 700 మందికి పైగా క్రీడాకారులు, అధికారులు పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగం తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.క్రిష్టారెడ్డి, ఉపాధ్యక్షుడు క్రిష్ణరాజ్‌పుత్, చిత్రాషినాయ్, కోశాధికారి ఎస్‌కే.జమీల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో పోటీలు నిర్వాహిస్తున్నామని, ఈనెల 25న వర్డ్ అండ్ డీడ్‌లో రాష్ట్ర పురుషులు, మహిళల త్రోబాల్ జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు చాంపియన్‌షిప్‌కు సంబంధించిన అధికారిక జెర్సీ, లోగోను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, చాంపియన్‌షిప్ పోటీల కమిటీ చైర్మన్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సీహెచ్. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, మే 20 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు కాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జర్నలిస్టుకాలనీ, బ్రాహ్మణ్‌సదన్‌లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏపీహెచ్‌బీకాలనీ, రాడిసన్‌హోటల్, డీఎల్ఎఫ్ గేట్ 1, 2, 3 విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీరగల్లు శిల్పాలను పరిరక్షించాలి

డాక్టర్ ఎస్.చెల్లప్ప

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో వీరగల్లు శిల్పాలను పరిరక్షిస్తున్నట్లుగానే రాష్ట్రంలో కూడా వాటిని పరిరక్షించాలని డాక్టర్ ఎస్.చెల్లప్ప అన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ బీవీ.భద్రగిరీష్ అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ రాసిన త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు (గణపతిదేవుని సంభాషణ-రుద్రమకీల్గుంటె) పుస్తకావిష్కరణ జరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయబాబు మాట్లాడుతూ త్రిపురాంతకంలో ఎన్నో శిల్పాలు ఉన్నాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు మన చరిత్రను యూరోపియన్లు వారి దృక్పథంతో రాశారని, వారి గొప్పతనం గురించి అందులో పొందుపర్చారని అన్నారు. తెలంగాణ చరిత్రను మరచిపోయే విధంగా అప్పటి పాలకులు చేశారన్నారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ వ్యవస్థాపకుడు వేదకుమార్ మాట్లాడుతూ ప్రపంచాన్ని నడిపిస్తున్న దేశాల కన్నా మనదేశానికి ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. ప్రతి గ్రామం ఒక మ్యూజియమేనన్నారు. చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చి భావితరాలకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర వారసత్వ శాఖ మాజీ ఉప సంచాలకుడు సముద్రాల శ్రీరంగాచార్య, కవి, చరిత్రకారుడు తురిమెల్ల శ్రీనివాస్ ప్రసాద్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్లు కట్టా శ్రీనివాస్, మురళీకృష్ణ, ప్రతినిధులు వేణుగోపాల్, ఎం.స్వామి పాల్గొన్నారు.



శిల్పాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎస్.చెల్లప్ప, డాక్టర్ కె.విజయబాబు, మణికొండ వేదకుమార్, తదితరులు



విద్యుత్ తీగలపై పడిన చెట్లు తొలగిస్తున్న సిబ్బంది

విద్యుత్‌తీగలపై కూలిన భారీ వృక్షాలు

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులకు కేపీహెచ్‌బీ 4, 5, 6, 9వ ఫేజ్‌లో భారీ వృక్షాలు విద్యుత్‌తీగలపై పడటంతో తెగిపడ్డాయి. 33 కేవీ విద్యుత్‌లైన్‌పై ప్లాస్టిక్ షీట్ పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. భారీ చెట్లు తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా రెండు గంటలకు పైగా నిలిచిపోయింది. డీఆర్ఎఫ్ టీం సభ్యులతో విద్యుత్‌శాఖ సిబ్బంది విరిగిన చెట్లను తొలగించారు. రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్, సైబర్ సిటీ ఎస్‌ఈ వెంకన్నలతో పాటు డీఈ, ఆపరేషన్ వింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. 4 విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో 33 కేవీ లైన్, వసంత్‌నగర్, డీమార్ట్ సమీపంలో 11 కేవీ విద్యుత్‌లైన్లు తెగిపోయినట్లు రంగారెడ్డి సీజీఎం ఆనంద్ తెలిపారు. జీహెచ్ఎంసీ డిజిస్టార్ బృందాలు చెట్లు తొలగించిన అనంతరం యుద్ధప్రాతిపదిన విద్యుత్ లైన్లు పునరుద్దరించి విద్యుత్ సరఫరా అందించినట్లు తెలిపారు. ఈదురుగాలులు, వర్షాలకు విద్యుత్‌తీగలు తెగిపడితే వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, తెగిపోయిన తీగలు ఎవరూ ముట్టకోవద్దని సూచించారు. 24 గంటలు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, విద్యుత్‌సమస్యలపై 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌తో పాటూ స్థానిక అధికారులను ఫోన్‌లో సంప్రదించాలన్నారు.



గాయని ఎస్పీ శైలజను సత్కరిస్తున్న అతిథులు

ఎస్పీ శైలజకు 'చక్రవర్తి జీవనసాఫల్యం' ప్రదానం

రవీంద్రభారతి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ ఎస్పీ శైలజకు సంగీత దర్శకుడు కె.చక్రవర్తి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సోమవారం రవీంద్రభారతిలో సుస్వరవాహిని సాంస్కృతిక కళాసంస్థ ఆధ్వర్యంలో స్వరాభిషేకం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శైలజకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ నిర్మాత, నటుడు మురళీమోహన్ పురస్కారగ్రహీతను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళల్ని, కళాకారుల్ని ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, అమీన్‌పాషా, పెద్ది సురేష్, నాదప్రియ, గాయత్రి నారాయణన్ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది.

ఫుట్‌పాత్‌లపై చెత్త డంపింగ్

- బతుకమ్మ రోడ్డులో.. భరించలేని కంపు
- ముక్కులు మూసుకుని ఇబ్బందులు పడుతున్న స్థానికులు



ఫుట్‌పాత్‌లపై చెత్త డంప్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఫతేనగర్, మే 20(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ బతుకమ్మ రోడ్డు దుర్గంధ భరితంగా మారింది. ఈ రోడ్డు పక్కనే నాలా ఉండడంతో పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో అటుగా వెళ్లే పాదచారులు అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్రమైన దుర్గంధం వెలువడుతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫుట్‌పాత్‌పై చెత్త డంపింగ్ చేస్తుండడంతో రోడ్డుపక్కనే చెత్తకుప్పలు పేరుకు పోతుండడంతో ఈ మార్గం గుండా వెళ్లాలంటేనే ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బతుకమ్మ రోడ్డులో ఉన్న చెత్త, అక్రమ పార్కింగ్‌లను తొలగించాలని కోరుతున్నారు.

- చెత్తను తరలించరా..?

పేట్‌బషీరాబాద్: జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జీడిమెట్ల డివిజన్‌లోని రుక్మిణీ ఎస్టేట్ నుంచి ఫస్ట్ ఎవెన్యూ కాలనీ ప్రధాన రహదారి వెన్నెలగడ్డ చెరువు కట్టపై చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్ల పక్కన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రహదారులపై చెత్త పేరుకుపోతోందని ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.అధికారులు ఇప్పటికైనా చెత్తను తరలించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

- చెత్తసేకరణపై అప్రమత్తంగా ఉండాలి

గచ్చిబౌలి: రాబోయే వర్షాకాలంలో చెత్త సేకరణ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జూలై 2 నాటికి చెత్తకుప్పలులేని ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహశబరీష్ పారిశుధ్య నిర్వహణ అధికారులను ఆదేశించారు. సోమవారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రపురం, చందానగర్, యూసఫ్‌గూడ, శేరిలింగంపల్లి సర్కిళ్ల పారిశుధ్య నిర్వహణ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చెత్తసేకరణ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జూన్ 2 తర్వాత చెత్తకుప్పలు కనిపిస్తే ఆ ప్రాంత ఎస్ఎఫ్ఏలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేస్ట్‌మేనేజ్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపకమిషనర్లు, ఎంఎహెచ్‌ఓలు, ఎస్ఎఫ్ఐలు, శానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్‌సీ స్నేహశబరీష్